క్లుప్తంగా

డిజిటల్ సహాయకులకు పదోన్నతి

అనపర్తి: మండలంలోని వివిధ సచివాలయాల్లో డిజిటల్ సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న ఐదుగురు.. గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు. దొర శ్రీనివాస్ (ఊలపల్లి–2), కర్రి రాజగోపాలరెడ్డి (తాపేశ్వరం–2), కర్రి అరవింద్ రెడ్డి (కొంకుదురు–2), కేశనకుర్తి రాజు (బిక్కవోలు–4), నల్లమిల్లి కోటిరెడ్డి (అనపర్తి–3) సచివాలయాలకు గ్రేడ్–5 కార్యదర్శులుగా పదోన్నతి పొందారు. వీరంతా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మండల అభివృద్ధి అధికారి మండ రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు



నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే బలరామకృష్ణ

రాజానగరం: నియోజకవర్గంలో సాగు నీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధికారులకు సూచించారు. ఆయన మంగళవారం తన కార్యాలయంలో నీటిపారుదలశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ముఖ్యంగా పుష్కర కాలువకు సంబంధించి నియోజకవర్గ పరిధిలో 12 పనులకు అనుమతులు లభించాయని, సత్వరమే ఆయా పనులు ప్రారంభించి, పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రంగారావు, రాజేశ్వరరావు, డీఈఈలు నాగేంద్ర ప్రసాద్, పార్వతి, ఏఈలు విజయ్ భరత్, సాయికృష్ణ పాల్గొన్నారు.

దీక్షితులు రామకృష్ణకు మూడో డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న రామకృష్ణ

రాజానగరం: నరేంద్రపురానికి చెందిన పురోహితుడు, సిద్ధాంతి డాక్టర్ దీక్షితులు రామకృష్ణ మూడో డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో ప్రాక్ జ్యోతిష విద్యాపీఠం, పరాశర అకాడమీ ఆస్ట్రలాజికల్ సైన్స్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు డాక్టరేట్ అందజేసి, సన్మానించారు. ఇప్పటికే జ్యోతిష శాస్త్రంలో రెండు డాక్టరేట్‌లు పొందిన ఆయన మూడో డాక్టరేట్‌ను ముహూర్త శాస్త్రంపై చేసిన పరిశోధన ద్వారా అందుకున్నారు. సహస్రావధాని పద్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ, శృంగేరి పీఠం జ్యోతిష పండితులు శంకరమంచి రామకృష్ణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్ల సమావేశం

కోరుకొండ: కాపవరం ఎంఈఓ కార్యాలయంలో ఎంపీడీఓ కార్యాలయం ఏఓ శామ్యూల్ సతీష్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఎస్సీ, బీసీ కార్పొరేషన్ రుణాలు అందజేయడంపై చర్చించారు. మండలంలోని ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

గుండెపోటుతో పీహెచ్‌సీ డాక్టర్ మృతి



డాక్టర్ కోటేశ్వరరావు (ఫైల్)

కోరుకొండ: దోసకాయలపల్లి పీహెచ్‌సీ డాక్టర్ వల్లభ కోటేశ్వరరావు (39) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు ఉదయం బూరుగుపూడిలో ఇంటి వద్ద ఛాతిలో మంట వచ్చింది. వెంటనే హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని దోసకాయలపల్లి పీహెచ్‌సీ వద్ద కొంతసేపు ఉంచారు. ఆయనకు సహోద్యోగులు, హాస్పిటల్ సిబ్బంది, మిత్రులు నివాళులర్పించారు. అనంతరం మృతదేహాన్ని సొంతూరు మాచర్లకు తీసుకువెళ్లారు.

అక్రమ అరెస్టులతో బెదిరించలేరు

సీటీఆర్‌ఐ: అక్రమ అరెస్టులతో వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను బెదిరించలేరని పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాలి వేణు అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. మాజీ మంత్రి, బీసీ నాయకురాలు విడదల రజిని పట్ల చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బానాయుడు అనుచితంగా ప్రవర్తించారన్నారు. గుంటూరు జిల్లా కంతేరులోనూ పార్టీ ఎంపీటీసీ అయిన కల్పన అనే దళిత మహిళను రాత్రి 3 గంటల సమయంలో పోలీసులు దౌర్జన్యంగా అరెస్ట్ చేశారన్నారు. మాజీ ఎంపీ నందిగామ సురేష్‌ను రెండోసారి అరెస్టు చేయడం దారుణమన్నారు. రాజ్యాంగ నియమావళిని, పోలీసు ఉద్యోగ విధివిధానాలను తుంగలో తొక్కి, రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగస్వాములై ముందుకు వెళ్లే విధానం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎక్కువ శాతం ఎస్సీ, బీసీలపైనే అరాచకాలు జరుగుతున్నాయన్నారు.

భూమికి సారం .. రైతుకు సాయం

- పచ్చిరొట్ట సాగుతో అనేక ప్రయోజనాలు
- నేలకు బలం, ఎరువుల ఆదా
- సాగుకు ఇదే సరైన సమయం



పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగించే జీలుగు పైరు ఇదే

పెదపూడి: రబీ వరి మసూళ్లు దాదాపు పూర్తయ్యాయి. రబీ అనంతరం మూడో పంటగా పలువురు రైతులు అపరాల పండిస్తుంటే మరి కొందరు పచ్చిరొట్టను సాగు చేస్తారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా రసాయన ఎరువుల వాడకం పెరిగిపోయింది. ఫలితంగా భూసారం తగ్గుతోంది. దీని ప్రభావం మళ్లీ సాగు చేసే పంటపై పడి దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు దిగుబడులు పెరిగేందుకు ఎక్కువ రసాయన ఎరువులు వాడుతుండటంతో భూసారం మరింతగా క్షీణిస్తోంది. పొలంలో సారం పెంచేందుకు రైతులు రబీ పంటల అనంతరం చేలల్లో పచ్చిరొట్ట పైరును పెంచడం ఎంతో మంచిదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. తద్వారా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోడానికి వీలు ఉంటుందంటున్నారు. పచ్చిరొట్ట సాగుకు సంబంధించి పలు విషయాలను మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్ వివరించారు.

66,700 ఎకరాల్లో రబీ సాగు

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లోని అనపర్తి, పెదపూడి, బిక్కవోలు, రంగంపేట, రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లో సుమారు 66,700 ఎకరాల్లో రబీ సీజన్‌లో వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి కోతలు పూర్తయిన నేపథ్యంలో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకునేందుకు ఇదే సరైన సమయం. వరి కోతల అనంతరం చేలల్లో పదును ఉన్న సమయంలోనే పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే భూసారానికి ఎంతో మేలు చేకూరుతుంది.

నేలకు బలం

గతంలో రైతుల భూసారం పెరగడానికి పచ్చిరొట్ట పైర్లను రబీ పంటల అనంతరం వేసేవారు. ఇటీవల పచ్చిరొట్ట పైరుల పెంపకం తగ్గిపోయింది. దీనివల్ల భూసారం తగ్గి పంటలు తెగుళ్ల బారినపడుతున్నాయి. రైతులు తెగుళ్లను అరికట్టడానికి విచ్చలవిడిగా రసాయన మందులు పిచికారీ చేసే అనర్థాలను కొనితెచ్చుకుంటున్నారు. రబీకి ఖరీఫ్‌కు మధ్యలో పచ్చిరొట్ట పైర్లను పెంచడం వలన భూసారం బాగా పెరుగుతుంది.

స్థూల పోషకాలు అధికం

జనుము, జీలుగ, పిల్లి పెసర, ఉలవ, నీలి తదితర రకాలను ఖరీఫ్, రబీకి మధ్య సాగు చేసుకోవాలి. వీటిని పూత దశ వరకు పెంచి ఖరీఫ్ పంట వేసే ముందు భూమిలో కలియదున్నాలి. పచ్చిరొట్ట పైర్లలో స్థూల పోషకాలు అధికంగా ఉంటాయి. నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం, భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 నుంచి 2 శాతం వరకు ఉంటాయి. స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా భూమికి లభిస్తాయి. పంటల ఎదుగుదలకు ఈ మూడు పోషకాలు ఎంతో అవసరం. వీటి వల్ల నేలలో సంపూర్ణమై ఉత్పాదకత పెరుగుతుంది. భూమి లోపల నిక్షిప్తమైన పోషకాలను ఈ పైర్లు వెలికితీస్తాయి. ఈ పైర్ల సాగుతో 30 శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. రైతులు ఆర్థికంగా లాభపడటానికి పచ్చిరొట్ట పైర్లు దోహదం చేస్తాయి. ప్రస్తుతం ఎరువుల ధరలు అకాశాన్నంటుతున్న నేపథ్యంలో పచ్చిరొట్ట పైర్ల సాగుతో ఎంతో మేలు జరుగుతుంది.

గుళికలతో నష్టం

ఖరీఫ్ రబీ పంటల్లో రైతులు గుళికలను అధికంగా వాడటంతో భూమి లోపల సూక్ష్మజీవులు నశించిపోతున్నట్లు శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలింది. గతంలో ఒక గ్రాము మట్టికి కోట్లాది సూక్ష్మజీవులు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య లక్షల్లో పడిపోయింది. పంటల పెరుగుదలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు నశించడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలియదున్నడంతో తిరిగి సూక్ష్మజీవులు అభివృద్ధి చెందే అవకాశం ఉందని వ్యవసాయాధికారి మణిదీప్ తెలిపారు. సహజంగా చౌడు బారిపోయిన భూముల్లో జీలుగ వేసుకుంటే భూమి భూసారం పెరిగి పంటకు అనుకూలంగా మారుతుంది.

వంగడాల ఎంపికే కీలకం



డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు

రాజానగరం: సీజన్ ఏదైనా మంచి దిగుబడులు సాధించాలంటే ముందుగా అందుకు అవసరమైన వంగడాలను ఎంపిక చేసుకోవడం ఎంతో ముఖ్యమని దివాన్ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్‌కి నార్లు వేసేందుకు సమాయత్తమవుతున్న రైతులు మంచి విత్తనాలను ఎంచుకోవాలని సూచించారు. స్వర్ణ రకంగా పిలువబడే ఎంటీయూ 7029 వరి వంగడం సాధారణ పరిస్థితులలోను అసాధారణ దిగుబడులను అందిస్తుందన్నారు. అలాగే పడిపోని స్వర్ణగా పేరొందిన ఎంటీయూ 1318, పీఎల్ 1100, సన్నరకాలలో ఎంటీయూ 1224, 1293 రకాలు మంచి దిగుబడులకు అనువైనవన్నారు. విత్తన సేకరణ మంచి నమ్మకం ఉన్న డీలర్లు, రైతుల నుంచి జరగాలని సూచించారు. ముందుగా మొలక శాతాన్ని పరిశీలించాలని, 80 నుంచి 85 శాతం వరకు మొలక శాతం ఉన్న విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. తమ శాఖ నుంచి కూడా త్వరలోనే కొత్త వరి వంగడాలను సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

పచ్చి జీడి పిక్క.. కమ్మని రుచి పక్కా



ఏడీబీ రోడ్డు పక్కన విక్రయిస్తున్న పచ్చి జీడిపిక్కలు

- ఏడీబీ రోడ్డులో దుకాణాలు
- జోరుగా విక్రయాలు

రంగంపేట: సాధారణంగా జీడిపప్పు గురించి తెలియని వారెవ్వరూ ఉండరు. జీడి కాయలు పండిన తర్వాత వాటి నుంచి పిక్కలను వేరుచేసి, గ్రైండింగ్ చేసి జీడిపప్పును తయారు చేస్తారు. వివిధ రకాల వంటల్లో గార్నిష్‌గా జీడిపప్పును వాడతారు. అయితే జీడి కాయలు పండకుండా పచ్చిగా ఉన్నప్పుడే వాటి పిక్కలతో కూర పండుతారు. దీని రుచి చాలా అద్భుతంగా ఉంటుంది. వీటినే పచ్చి జీడి గింజలు ఉంటారు. ఎండు జీడిపప్పు కంటే ఎంతో అద్భుత రుచి గల పచ్చి జీడి గింజలను ఏడీబీ రోడ్డు పక్కన వ్యాపారులు విక్రయిస్తున్నారు. వీటిని బద్దలు కొట్టి, దానిలోని పప్పు ఒలిచి కూర వండుతారు. ఈ కూర జీడిగింజల సమయంలోనే చేసుకునే వీలుంటుంది. సమయం దాటిందంటే మళ్లీ ఏడాది వరకూ అవకాశం ఉండదు. మండలంలోని కోటపాడు, వెంకటాపురం, జి.దొంతమూరు, వీరంపాలెం, ఈలకొలను, సింగంపల్లి, నల్లమిల్లి తదితర గ్రామాల్లో జీడిమామిడి తోటలు ఉన్నాయి. ఈ తోటల్లోని పచ్చి జీడి గింజలను రైతులు, వ్యాపారులు ఏడీబీ రోడ్డు పక్కన విక్రయిస్తున్నారు. కిలో పచ్చి జీడి గింజలను రూ.150కు విక్రయిస్తున్నారు. రోడ్డుపై ప్రయాణించే వారందరూ వాటిని కొనుగోలు చేస్తున్నారు. పచ్చి జీడిపిక్కల విక్రయాల ద్వారా చాలా మందికి ఉపాధి దొరుకుతుంది.

చెరువు ఆక్రమణదారులతో ముఖాముఖి

సీతానగరం: మిర్తిపాడులోని చెరువుల ఆక్రమణదారులతో మంగళవారం ఎంపీడీవో భారతి, డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తి ముఖాముఖి నిర్వహించారు. అక్కడి నుంచి ఖాళీ చేయాలని సూచించారు. మిర్తిపాడులోని చెరువును ఆక్రమించి పాతిక కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. మరికొందరు దుకాణాలు కూడా నెలకొల్పారు. ఈ నేపథ్యంతో నివాసాలు, దుకాణాలు ఖాళీ చేయాలంటూ వారం రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. అలాగే ఆక్రమణదారులతో ఎంపీడీవో భారతి, డిప్యూటీ ఎంపీడీవో మూర్తి ముఖాముఖి మాట్లాడారు. చెరువు ఆక్రమించడం సరైన విధానం కాదని, తక్షణమే ఖాళీ చేయాలని సూచించారు. అక్రమణదారులకు జగనన్న కాలనీలో స్థలాలు ఇవ్వడం జరిగినందున అక్కడకు వెళ్లాలన్నారు. కాగా.. తక్షణమే ఖాళీ చేయాలంటే ఎలా అని, తమకు రెండు నెలలు గడువు ఇవ్వాలని నివాసం ఉంటున్న కుటుంబాల వారు కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ రవీంద్ర, పంచాయతీ కార్యదర్శి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి స్పోర్ట్స్ కాంప్లెక్స్



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నగర ప్రజలందరికి త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఆయన మంగళవారం నారాయణపురంలోని గోదావరి పుష్కరాలు ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మరో ఐదు రోజుల్లో పనులు పూర్తి కావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాదాపు రూ.4.30 కోట్లతో సకల సదుపాయాలతో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఇందులో షూటింగ్, స్నూకర్ (బిలియర్డ్స్), టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్‌తో పాటు లేటెస్ట్ ఎక్విప్ మెంట్‌తో జిమ్ కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. నగరంలో ఉత్తమ క్రీడాకారులను తయారు చేసేందుకు కొత్తగా నిర్మించిన మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ దోహదపడుతుందన్నారు. రాజమహేంద్రవరంలో క్రీడలకు అనువైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు కమిషనర్ తెలిపారు. ఆయన వెంట ఎస్ఈ కోటేశ్వరరావు, ఈఈ రీటా, ఉన్నారు.

ఇంటి హక్కుల కోసం దరఖాస్తు చేసుకోండి

సీతానగరం: అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లను నిర్మించుకున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అభ్యంతరకరం లేని ప్రభుత్వ భూముల్లో 2019 అక్టోబర్ 15 నాటికి ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న బీపీఎల్ కుటుంబాలకు ప్రభుత్వ స్థలం 150 గజాల మేరకు ఉచితంగా హక్కులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. దీని కోసం జీవో ఎంఎస్ నెంబర్ 30ను విడుదల చేసిందన్నారు. పక్కా భవనమై ఉండాలని, అలాగే పంచాయతీ పన్ను చెల్లిస్తుండాలన్నారు. ఏటిగట్టు, చెరువులను ఆక్రమించి నివాసం ఉంటున్నవారు అర్హులు కాదన్నారు. కావున అర్హులైన వారు తగిన వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం ఆయా గ్రామాల్లోని వీఆర్వోలను సంప్రదించాలన్నారు.

కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలి



పెదపూడిలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ కార్యకర్తలు, నాయకులు

పెదపూడి: కార్మికులకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ మండల కన్వీనర్ ఎం.రాజేశ్వరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెదపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. రాజేశ్వరి మాట్లాడుతూ దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జూలై 9కి మార్పు చేశారన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, నిత్యావసరాల ధరలు తగ్గించాలని, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ చేయరాదని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ పీవీ సీతాపతిరావుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కార్యకర్తలు జి.సత్యవతి, వల్లూరి ఉమావతి తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శి ఫిర్యాదుపై డీఎస్పీ విచారణ

బిక్కవోలు: కాపవరంలోని సచివాలయంలో రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య విచారణ చేశారు. వివరాల్లోకి వెళితే.. సర్పంచి సత్యంశెట్టి వెంకటరమణ సచివాలయం వెల్నెస్ సెంటర్‌కు, చేసిన బిల్లులు పెట్టామని ఒత్తిడి చేస్తున్నారని, తీర్మానాలు చేయడం లేదని, దుర్భాషలాడి అవమానం చేశారని పంచాయతీ కార్యదర్శి కె.విజయలక్ష్మి ఆత్మహత్యకు యత్నించారు. అనంతరం ఆమె ఫిర్యాదు మేరకు బిక్కవోలు ఎస్సై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ బి.విద్య విచారణ జరిపారు. కార్యక్రమంలో ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్ర రెడ్డి

పెదపూడి: యోగాను విద్యార్థులు, ఉద్యోగులు బాధ్యతగా నేర్చుకోవాలని, జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. యోగా డే సందర్భంగా జూన్ 21న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నం వస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో యోగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. దీనికి సంబంధించి మండల, గ్రామ స్థాయి కమిటీలు నియమించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీవీ సీతాపతిరావు, డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి, ఎస్సై కె.రామారావు, టీడీపీ మండల అధ్యక్షుడు జుత్తిక కృష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తమలంపూడి శివరామారెడ్డి, వెలుగు ఏపీఎం అరుణ, ఎంఈఓ–2 సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● ప్రభుత్వం అందజేస్తున్న గృహ నిర్మాణ రుణ సౌకర్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి అన్నారు. పెదపూడిలోని లేఅవుట్‌లో 56 మంది గృహ నిర్మాణ లబ్ధిదారులకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ లంక వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ విధానంతో వీఆర్వోలపై పనిభారం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

రాజానగరం: ప్రస్తుతం అమలులో ఉన్న గ్రామ సచివాలయ వ్యవస్థలో క్లస్టర్ విధానాన్ని తీసుకువస్తూ జారీ చేసిన జీఓ నంబర్ 4పై పునరాలోచన చేసి, వీఆర్వోలకు న్యాయం చేయాలని మండల వీఆర్వోల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు స్థానిక తహసీల్దారు జీఏఎస్ఎల్ దేవికి సంఘ ప్రతినిధులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ విధానంలో రెండు గ్రామ సచివాలయాలను ఒక క్లస్టర్‌గా గుర్తించి రేషనైజేషన్ పేరుతో వీఆర్వోల సంఖ్యను కుదించాలనుకోవడం సరైన నిర్ణయం కాదన్నారు. దీనివల్ల రాష్ట్రంలో 7500 మంది వీఆర్వోలను మిగులు సిబ్బందిగా చూపించి, వారిని ఏ శాఖకు సర్దుబాటు చేయక పోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఇప్పటికే ఈ విషయమై మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అధికారులకు, రెవెన్యూ శాఖా మంత్రికి వినతులు సమర్పించామన్నారు. అవసరం అయితే 2019 వరకు అమలులో ఉన్న రెవెన్యూ విలేజీకి ఒక వీఆర్వో విధానాన్ని అమలు చేయాలని, రెవెన్యూకు సంబంధించిన పనులను మాత్రమే చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా జరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా జరగాలని అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ఆదేశించారు. ఆయన మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పబ్లిక్ హెల్త్‌పై అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో కాలువల్లో ఎక్కడా నీరు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు పూడిక తొలగించాలన్నారు. ప్రతి రోజు ఇంటింటికీ చెత్త సేకరణ తప్పనిసరిగా జరగాలన్నారు. నిత్యం ఉదయం 7 గంటలకే డోర్ టూ డోర్ చెత్త సేకరణ మొదలు కావాలని ఆదేశించారు. రాత్రి పూట పనిచేసే సిబ్బంది రేడియం అప్రాన్లు తప్పనిసరిగా ధరించాలన్నారు. వర్షాల నేపథ్యంలో యాంటీ లార్వా ఆపరేషన్లు నగరంలో క్రమం తప్పకుండా జరగాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు చిత్రాల ద్వారా ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంహెచ్ఓ వినూత్న, శానిటరీ సూపర్ వైజర్ ఐ.శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్ వైజర్లు, బయాలజిస్ట్, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సేవలకు సెలవు..

- నిరుపయోగంగా కియోస్క్‌లు
- మూలకు చేరుతున్న వైనం
- అన్నదాతలకు అవస్థలు

రాజమహేంద్రవరం రూరల్: అన్నదాతలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుతం రైతు సేవాకేంద్రాలు) ఏర్పాటు చేసింది. వారికి నిరంతర సేవలందించడం కోసం కియోస్క్‌లను ప్రవేశపెట్టింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్వాకంతో కియోస్క్‌లు అలంకారప్రాయంగా మారాయి. వైఎస్సార్ సీపీ పాలనలో 2021 జూలైలో ఆర్‌బీకేలను ప్రారంభించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా రైతుల ఇంటి ముంగిటకే సేవలు అందించాలనే లక్ష్యంతో వీటిని తీసుకువచ్చారు. వీటి ద్వారా అన్నదాతలకు విత్తు నుంచి విక్రయం వరకూ అన్ని విధాలా తోడ్పాటు లభించేది. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక వీటిని నిర్వీర్యం చేసింది.

రైతులకు అండగా..

విత్తనం నుంచి పంట విక్రయాల వరకు అన్నదాతలకు ప్రతి అడుగులో అండగా నిలబడాలనే సదాశయంతో కియోస్క్‌లను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అవసరమైన రైతులు ఈ కేంద్రాల వద్దకు వచ్చి సిబ్బందికి తెలియజేస్తారు. కియోస్క్‌ద్వారా సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఎవరికి ఏ రకం కావాలో రప్పించే పరిస్థితి ఉండేది.

40 కియోస్క్‌లు

నియోజకవర్గంలోని కడియం, రూరల్ మండలాల్లోని 43 రైతు భరోసా కేంద్రాల్లో 40 కియోస్క్‌లు ఉన్నాయి. ప్రస్తుతం చాలా చోట్ల ఇవి పనిచేయడం లేదు. దీంతో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో ఏర్పాటు చేసిన ఈ కియోస్క్‌లు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. కచ్చితమైన సమాచారం, ఫలితాలతో నాడు రైతులకు వ్యవసాయశాఖ అన్ని విధాలా సేవలందించింది. కానీ కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోందని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తొలుత రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చి నేడు సేవలు కూడా అందించకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు.

మూలన చేరుతున్న వైనం

కియోస్క్‌ల ద్వారా వాతావరణంలో మార్పులు తెలుసుకుని అందుకు అనుగుణంగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టే వెసులుబాటు అందుబాటులో ఉండేది. పంట ఉత్పత్తుల మద్దతు ధరలు కూడా వీటి ద్వారా రైతులు తెలుసుకొనే వారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కియోస్క్‌లు మూలకు చేరుకున్నాయి. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తిస్థాయిలో పంపిణీ చేసేవారు. ప్రస్తుతం రైతులు సొసైటీలు, డీలర్ల వద్ద ఎరువు కొనుగోలు చేసుకుంటున్నారు. ఆర్‌బీకేలను రైతు సేవాకేంద్రాలుగా మార్చినా సేవల కొనసాగింపులో మాత్రం కూటమి ప్రభుత్వం వివక్ష చూపిస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ముద్ర లేకుండా చేయడం కోసం ఆర్‌బీకేల సేవలకు స్వస్తి పలికింది. ఫలితంగా ఆర్‌బీకేల లక్ష్యం నీరుగార్చింది.



బొమ్మూరు రైతుసేవా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్

మొబైల్ యాప్‌తో..

కియోస్క్ యంత్ర పరికరంలో ఉన్న సేవలను ప్రస్తుతం మొబైల్ యాప్‌లతో రైతులకు అందించడం జరుగుతుంది. రైతులెవ్వరికీ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ఏ.భీమరాజు, వ్యవసాయాధికారి, రాజమహేంద్రవరం రూరల్

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ

రాజమహేంద్రవరం రూరల్: ఆపరేషన్ సిందూర్ విజయానికి మద్దతుగా సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో మంగళవారం హుకుంపేట వెంకటగిరిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుడు మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక విశ్రాంత సైనికులు గణపతి, అక్బర్, నరేష్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, జిల్లా ఉపాధ్యక్షుడు కరుటూరి శ్రీనివాసరావు, జిల్లా ఈఎస్ఐ డైరెక్టర్ ఒంటెద్దు స్వామి, తనుబుద్ధి సూర్యభాస్కరరావు, సిద్ధాని వెంకట్ పాల్గొన్నారు.

సంగీతంతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సంగీతం నేర్చుకోవడం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందని సంగీత టీచర్ వీరరత్నకుమారి అన్నారు. రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం నీతి కథలు చెప్పడం, తెలుగు పద్యాలు, చదరంగం, నృత్యం, భగవద్గీత తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాసు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.